# ఒకింత

ఈనాడు ఆదివారం,19 నవంబర్, 2006

తెలుగునాడి, జనవరి, 2007



# ఒకింత

ఎందుకో తెలియదు కానీ, నాకు వళ్ళు మండిపోతోంది.

అరచేతిలో అలవోకగా అమిరిన పేకముక్కలను - మిత్రబృందం ముందు ఒకింత విసుగ్గా విసిరేసి - వేళ్ళు విరుచుకొన్నాను.

ఓ "సారీ...యార్ !" ను గాలిలో గిరాటేసి - వళ్ళు విరుచుకుంటూ లేచి నిలబడ్డాను. పరాగ్గా ఇంటి ముఖం పట్టాను.

ఇంటి తలుపు తీసుకొని చివాలున ఇంట్లోకి అడుగు పెట్టాను...

హారిక హాల్లోనే ఎదురొచ్చింది. ఎదురు రావడం అంటే - ఎదురుగా కనబడింది. సోఫాలో బాసింపట్టు వేసుకొని కూర్చొని - వళ్ళో ల్యాప్‌టాప్ పెట్టుకొని - ఏదో నములుతూ - నింపాదిగా.

హారిక ఎదురుగా టీపాయ్ మీద కాగితాల దొంతరలు. పక్కనే కార్నర్ టేబుల్ మీద సిడిలు. రంగురంగుల పెన్సిళ్ళు.

నేను ఇంట్లోకి ఎంత వేగంగా వచ్చానో - బహుశా సుడిగాలిలా - అయినా, హారిక చలించలేదు. స్క్రీన్‌పై నుంచి ఆమె కళ్ళు కదల్చలేదు. తలెత్తి తలుపు వైపు చూడనే లేదు. నిమ్మళంగా తన పనేదో తను చేసుకొంటోంది. టచ్ స్క్రీన్‌పై ఆమె వేలు సుతారంగా కదులుతోంది.

నా ఉనికిని ప్రకటిస్తూ – తలుపును దఢాలున మూసాను. సాండల్ స్ట్రాప్స్‌ను బర్రుబర్రున లాగి – చెప్పులు స్టాండ్‌లో దురుసుగా పడేసాను. లోన గదిలోకి దబదబమంటూ వెళ్ళాను.

హారిక ఎప్పుడు వచ్చిందో కానీ, నా వెనకే నిలబడి వుంది.

ఆమె అందించిన ఆహ్వానపు చిరునవ్వును పట్టించుకోకుండా అల్మేరాలో నుంచి లుంగీ తీసుకొని బాత్‌రూం లోకి వెళ్ళాను.

హారిక నొసలు ముడి పడ్డాయి. ఓ క్షణం.

అదే ఆమె వంక నేను చివరిసారిగా చూడడం.

బయటికి వచ్చి చూసే సరికి టేబిల్ మీద జ్యూస్.

హారిక మటుమాయం.

హు!

విప్పిన బట్టలు ఉండ చుట్టి వాకిట్లోకి విసిరేశాను, కొంత విసుగ్గా, కోపంతో, అలా చేయడం బావుండదు. ఇంటీరియర్ డిజైనర్ పేజీలోకి అదాటున నడిచొచ్చినంత అందంగా ఉంటుంది మా ఇంటి వాతావరణం, అయినా అలా చేయాలనిపించింది.

మళ్ళీ హాల్లోకి వెళ్ళాను, హారిక ప్రత్యక్షం, అదే సోపాలో, అదే పొజిషన్‌లో.

"స్టాప్ దట్ నాన్సెన్స్!" నాకు తెలియకుండానే కరుగ్గా పలికింది నాకంఠం.

"ప్రహ్లాద్... ఇందాక వస్తే నువ్వు వాష్‌రూమ్‌లో ఉన్నావు..." హారిక ఏదో చెప్పబోయింది.

"డామ్ విత్ యూ!" గిర్రున వెనక్కి తిరిగే లోగానే –

హారిక ముఖాన ఓ కన్ఫ్యూజ్డ్ లుక్ - ఆశ్చర్యార్థకంగా తేలియాడింది.

నేను వెళ్ళి టివి ముందు కూలబడ్డాను. చిరాగ్గానే రిమోట్ చేతిలోకి తీసుకున్నాను.

"ఏదైనా ప్రాబ్లెమా...?" హారిక అడగబోయింది.

ముఖం టివి వైపు తిప్పాను. స్క్రీన్‌కు కళ్ళు అతికించి. రిమోట్‌తో ఛానెళ్ళు చక చక మార్చసాగాను.

నాకు తెలుస్తూనే ఉంది. నా ముఖం చెక్కలా బిగుసుకోవడం.

యం, యఫ్, ఆ, మా, ఈ, జీ, తూ, తా... ఏది బడితే అది నా వేళ్ళకిందుగా టకటక మారిపోతూ ఉంది, తెరమీద. బిర బిర చర చర.

హారిక భుజాలెగరేసి, గది బయటకు వెళ్ళింది.

అన్ని ఛానెళ్ళు ఒకటే. గజిబిజి యాంకర్లు. గందరగోళపు అడ్వర్‌టైజ్‌మెంట్లు. హారిక మళ్ళీ వచ్చింది. ఏదో ఘనపదార్థం మరింకేదో ద్రావకం ట్రేలో అందంగా అమర్చుకొని.

నా ముఖం, శరీరం మరింత బిగదీసుకున్నాయి.

కళ్ళు టివికి... శరీరం వాలుకుర్చీకి... వేళ్ళు రిమోట్‌పై... బిగిసిపోయాయి.

హారిక ఒక్కసారిగా ఊపిరి పీల్చి వదిలింది.

టీపాయి మీద ట్రే పెట్టేసి లోపలికి వెళ్ళింది.

టంగ్ టింగ్ బుర్ర్ బర్ర్ మంటూ చప్పుళ్ళు వంటింట్లోంచి.

ట్రేని ఖాళీ కప్పులతో సహా తీసుకెళ్ళి వంటింటి సింక్‌లో పడేశాను.

హారిక నిశ్శబ్దంగా వంటింట్లో అల్మేరాలు సర్దుతోంది. డస్టర్‌తో దుమ్ము దులుపుతోంది. కిచెన్ ప్లాట్‌ఫాం అంతా గాజు సీసాలు డబ్బాలు వగైరాలు.

గడ్డ కట్టిన కాఫీ పొడి డబ్బాలో నీళ్ళు పోసి సింక్‌లో పెట్టింది. తిరగమోత దినుసుల పెట్టెల్లోని చిన్న చిన్న కప్పులు నానబెట్టి ఉన్నాయి.

నేను విసురుగా పెట్టిన ట్రే కాఫీ డబ్బాను దొర్లించేసింది, కాఫీ నీళ్ళు సింక్ అంతా నిండాయి. వింతైన వాసన.

హారిక మెడ వంచి భుజం పైగా నా వైపొక చూపు విసిరేసింది.

ఏ భావం లేని అలాంటి చూపంటే నాకు వళ్ళు మంట.

“కాసేపు ఈ టింగ్ రంగుల గోల ఆపుతావా? ఇంటికి వచ్చినా ప్రశాంతత ఉండదు!” ఈ రెండు వాక్యాలు వ్రాక్కుచ్చి మళ్ళీ సోఫా వైపు పయనించాను.

పది పదిహేను నిమిషాల్లో అన్ని శబ్దాలు సర్దుకొన్నాయి. నెమ్మదిగా వంటింట్లో నిశ్శబ్దం.

చిరాగ్గా ఉంది. పరమ చిరాగ్గా ఉంది. మా చెడ్డ చిరాగ్గా ఉంది.

‘ఛ! హారికతో ఇలా మాట్లాడానేమిటి?’

చివాలున పైకి లేచాను. బాల్కనీలో హారిక. చేతిలో కెమెరా.

“ఏం చేస్తుందీవిడ?” నా నొసలు ముడి పడ్డాయి. కళ్ళు చికిలించాను.

ఎంతో ఏకాగ్రతతో మునివేళ్ళపై నుల్చుని – కెమెరా ఫోకస్ చేస్తోంది హారిక.

“ ఏంటబ్బా విశేషం?”

ఒక పిట్ట - పాలపిట్టో, నీలిపిట్టో మరింకేదో - ఓ గూడు కట్టుకుంది. కొన్నాళ్ళక్రితం. మా బాల్కనీ చివర. గ్రిల్ వంపులో. నీటిపైపుల వాలుగా.

ఎంత ఒడుపుగా నిలిపిందో .. తన చిన్న గూటిని.

హారిక కెమెరా అటువైపే ఫోకస్ చేసి ఉంది.

అది గూడంటే గూడు కాదు. పూచిక పుల్లల నుంచి వైరు ముక్కల దాకా అన్నింటితో అల్లిన పిట్ట ఇల్లు.

ఇంతలో వయ్యారంగా పిట్ట మారాణి వేంచేసింది. గూటి అంచున అలవోకగా వాలింది. పిట్ట పిల్లలు తమ చిన్ని పసుపు పచ్చని నోర్లు తెరిచాయి. కిచకిచ మంటూ. పిట్ట తల్లి రెక్కలల్లార్చుతూ సుతారంగా వాటి నోట్లో ఆహారం పెడుతోంది. మమేకమై. మమకారమై.

హారిక నిశ్శబ్దంగా ఆ దృశ్యాన్ని చిత్రిస్తోంది.

నా చిరాకు చివాలున నన్ను ముంచెత్తింది.

కర్టెన్‌ను బర్రున లాగాను. రింగులు కర్టెన్ రాడ్‌పై ఖంగుమన్నాయి.

పిట్టరాణి ఎగిరిపోయింది. పిల్లపిట్టలు బెదిరిపోయాయో లేదో కానీ - హారిక తిరిగి చూసింది, చివాలున, కళ్ళింత చేసుకొని. అదేదో చిత్రమైన చూపు నా వైపు విసిరేసి కెమెరాతో సహా మాయమైంది.

ఛ... ఛ!

నేను మళ్ళీ సోఫాశయనశాయిని అయ్యాను. ఛానెళ్ళు మార్పిడిలో సమయం ఎలా గడిచిందో తెలియలేదు. ఇల్లంతా చిరాకేసేంతటి నిశ్శబ్దం. నాకూ హారికకూ మధ్య ఘనీభవిస్తున్న మౌనసంద్రం.

'ఎటు పోయిందో మా ఇంటి బంగారు మొలక...!" నిట్టూర్పు వదిలా. లేచివెళ్ళి బాల్కనీలో నిల్చున్నా. కనుచివరల నుంచి గుట్టుగా ఆ పిట్ట గూడు వైపు చూశాను. ఆ పిట్టతల్లి మళ్ళీ ఎప్పుడు తిరిగి వచ్చిందో కానీ, పిల్లలకు రెక్కలాడించడం నేర్పుతోంది. కిచకిచ మంటూ పిట్టపిల్లలు సాధన చేస్తున్నాయి గూట్లోనే ఒదిగి.

ఏదో విసుగు. పిడికిలి బిగించి రెయిలింగ్‌పై ఒక పంచ్ ఇచ్చాను. ఆ ప్రకంపనానికో ఏమో పిట్ట ఎగిరిపోయింది. వెళుతూ వెళుతూ రెయిలింగ్‌పై ఓ క్షణమాగి రెక్కలు టపటప లాడించి –ముక్కును గాలిలోకి విసిరి వెళ్ళింది. దానికి నేపథ్యంగా పిల్లల కువకువలు. నా చూపులు ఆ పిట్టవైపే కదిలి వెళ్ళాయి. అప్రయత్నంగా.

హారిక మళ్ళీ కళ్ళబడింది కుండీల దగ్గర. ఆకుల్ని గిల్లుతూ, పువ్వుల్ని తాకుతూ, నీటిని చల్లుతూ, మట్టిని కదిలిస్తూ.

ఆ పిట్టరాణి చేసిన సందడికి మొక్కల మీదుగా హారిక చూపు పిట్ట గూడుపై పడింది.

పక్కనే నేను. నా ఉనికికి నాకే చర్రున మండుకొచ్చింది.

హారిక పెదవి బిగించి మళ్ళీ చిత్రమైన చూపొకటి నా వైపు విసిరేసింది.

గిర్రున తిరిగి గదిలోకి వెళ్ళాను, సోఫాలో కూలబడ్డాను.

హారిక లోపలికి వచ్చింది, చేతిలో ఏవో కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పువ్వులు అక్కడ పెట్టి మళ్ళీ వెళ్ళింది. గులకరాళ్ళు గుప్పిట నిండా తెచ్చి టీపాయి మీద పోసింది.

అప్పుడే కళ్ళు మూతలు పడుతున్నాయేమో, ఆ గులకల సవ్వడికి తల పగిలిపోయినట్లనిపించింది. నొసలు చిట్లించి కాళ్ళు టీపాయి మీద బార్లా చాపాను. పాదాలకు తాకి చెల్లాచెదరయింది గులకల గుట్ట.

హారిక వెళుతున్నదల్లా ఆగి, నా వైపొకసారి చూసి - ఊపిరి గట్టిగా వదిలి, మళ్ళీ బయటకు వెళ్ళింది.

మోచేతి వంపులో కళ్ళను దాచుకుంటూ -తలదిమ్ముతో పడుకోవడానికి ప్రయత్నించసాగాను. అలా కళ్ళు మూతలు పడ్డాయో లేదో - పిల్లల పకపకలు వినబడ్డాయి. వాటితో పాటే పిప్పీమంటూ పీకల గోల. 'అబ్బబ్బ! మొదలెట్టారూ...!' విసుగనిపించినా లేచి వాకిట్లోకి వచ్చాను. చిన్నారి, బుజ్జిగాడు వచ్చారేమోననుకుంటూ.

హారిక పక్కింటి పిల్లలకు కొబ్బరాకు బూరలు చేసి చూపిస్తోంది. పక్కనే ఎగరేయడానికి సిద్ధంగా ఉన్న గాలిపటాలు.

"నిజంగా మీరు బ్యాటిల్ షిప్ గేం ప్రోగ్రాం చేశారా ఆంటీ?" పక్కింటి పండుగాడు కళ్ళు టపటప లాడిస్తూ అడుగుతున్నాడు హారికని.

"ఊహు.. అది ఆట కాదు సెర్చ్ ఇంజిన్ -" హారిక మునివేళ్ళతో కొబ్బరి ఈనె తీస్తూ అంది.

"అంటే...?"

"నెట్‌లో నీక్కావలసిన చోటికి తీసుకెళ్ళేదన్నమాట... షిప్‌లాగా -" హారిక అరచేతిని గాల్లో నావలా నడిపింది.

"ఓ...! నావిగేటర్...!" పండు అంతా అర్థమైనట్లు దీర్ఘం తీశాడు.

"ఆంటీ...మీరు 'డావిన్సీ కోడ్' చూసేశారా ?" విన్నీ అంటోంది - "సో...సాడ్. సరిగ్గా అప్పుడే మాకు మిడ్ టర్మ్ సిరీస్ మొదలయిపోయాయి-" కొంపేదో మునిగినట్లు విన్నీ విషాదం.

"అంతే కాదు విన్నీ...పైరేట్స్ ఆఫ్ కరేబియన్ కూడా చూసేశాం -తెలుగులో!"

"ఈజిట్ !?!" విన్నీ పండు ఏక కాలంలో అన్నారు.

ఛండాలం! ఏం సినిమా అది! ఆ విలన్‌ని చూడగానే కడుపులో తెమిలింది. యాక్! వీళ్ళు పిల్లలు కాదు పిశాచాలు! మా ముత్యాల గురుగులు ఎటు బోయారు – చివ్వున వెనక్కి తిరిగాను.

ఆ కాలి సవ్వడికే పిల్లలు తలెత్తి చూశారు.

'హాయ్ అంకుల్...!" విన్నీనో పండునో ఎవరు ముందన్నారో ఇద్దరూ ఒకే సారన్నారో – హారిక గిర్రున తిరిగి నా వైపు చూసింది.

"ప్రహ్లాద్. ... నువ్వే చెప్పు వీళ్ళకి. మనం స్పైడర్ మాన్ కూడా తెలుగులో చూడలేదూ? నన్ను నమ్మట్లేదు వీళ్ళు!" హారిక ముఖం విప్పార్చి అచ్చం చిన్నపిల్లలా అంటోంది. ముగ్గురూ నా సమాధానం కోసం ఉత్కంఠగ నా వైపు చూశారు.

నా చూపులు, ముఖం, శరీరం – మళ్ళీ బిగుసుకుపోయాయి, ఏదో మంత్రం వేసినట్లుగా, మరేదో మాయజాలం జరిగినట్లుగా.

చివాలున తిరిగి ఇంట్లోకి వెళ్ళిపోయాను.

మరుక్షణం "సీ యూలు... బైబైలు" వినబడ్డాయి.

హారిక ఇంట్లోకి. నేను సోఫాలోకి.

ల్యాప్‌టాప్ తీశాను. మళ్ళీ పెట్టేశాను.

టీవి ఆన్ చేశాను. మళ్ళీ ఆపేశాను.

గదిలోకి వెళ్ళి కాస్సేపు ముసుగుతన్నాను.

హారిక జాడలేదు, ఇల్లంతా నిశ్శబ్దం. ఈ ప్రశాంతత మనశ్శాంతి నివ్వడంలేదు వళ్ళు మండిస్తోంది, కోపం రగిలిపోతోంది. ఇంతై ఇంతితై తానింతై – ఉఫ్!

పక్క కుదరక చివ్వున లేచి వెళ్ళాను.

డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని హారిక ఏదో కుడుతోంది. ఫ్రేంలోంచి తలపైకెత్తి నా వైపు చూసింది. నెమ్మదిగా మర్యాదగా అడిగింది, "ప్రహ్లాద్... ఏదైనా కావాలా? టీ, కాఫీ...?"

నేను ఏమీ మాట్లాడలేదు. కుర్చీ బర్రున లాగి దాంట్లో కూలబడ్డాను.

టేబుల్ మీద చిన్ని ముగ్గు. దాంట్లో నింపిన రంగుల పూలరేకలు. నడుమ వెలిగించడానికి సిద్ధంగా ఉన్న పరిమళాల మైనం .. నింపిన గులాబి ప్రమిద.

"మజ్జిగ.." ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండా పొడిగా అన్నాను.

హారిక ఏమీ మాట్లాడకుండా లోపలికి వెళ్ళింది.

కుర్చీ మీద కుప్పలా చిన్నారి గౌను. దానిపై వాలినట్లుగా హారిక కుడుతోన్న చిట్టి సీతాకోకచిలుక.

ఎందుకో తెలియదు. చిరాకు పరాకాష్టను చేరుకుంది.

హారిక తెచ్చిన మజ్జిగ తాగి గ్లాసును ఎంత విసురుగా పెట్టానంటే –నాకే నచ్చలేదు.

ముగ్గులోంచి రంగుల పూరేకులు చెదరిపోయాయి.

ఛ! అసంకల్పితంగా నా పిడికిళ్ళు బిగుసుకున్నాయి. అప్రయత్నంగా పెదవులు దవడలూ బిగుసుకున్నాయి. నాకు తెలుస్తూనే ఉంది. కాలితో కుర్చీని వెనక్కి నెట్టేసాను.

గబగబ మిద్దె మీదికి వెళ్ళి నిల్చున్నాను. వీథిలోని వాహనాల రాకపోకలపై దృష్టి నిలపాలని ప్రయత్నిస్తున్నాను. హారిక ఎప్పుడు వచ్చిందో దగ్గరగా వచ్చి నిల్చుంది. ఆమె ఊపిరి నన్ను తాకేంత దగ్గరగా.

"ఏంటి ప్రహ్లాద్ ...చూస్తున్నావు?" హారిక పలకరించబోయింది.

"ఏం లేదు!" ఆ పలకరింపును వేగంగా తిప్పి కొట్టింది నా సమాధానం.

హారిక ముఖం వెలవెలబోయింది. మౌనంగా కిందికి వెళ్ళింది.

ఛ! ఛ!!

ఏదో జరుగుతోంది, నాలోలో. తలపగిలి పోయేటట్లుగా ఉంది. గాల్లోకి పిడికిళ్ళు విసిరేశాను.

హారిక హర్ట్ అయ్యింది.

అయితే ఏం...?

కానీ!

ఎందుకో తెలియదు, నా కోపం చల్లారడం లేదు.

హారిక మంచం మీద బోర్లా పడుకొని ఏడుస్తూ ఉంటుంది, ఈ పాటికి. వెళ్ళి బతిమిలాడాలి. హు! ఈ బతిమిలాడడాలు బామాడడాలు – నేనెప్పుడూ చేయలేదు. ఇప్పుడెందుకు చేయాలి?

ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆ కోపంలోనే గబగబ కిందికి దిగి వచ్చాను.

మళ్ళీ సోఫాలో హారిక.

అదే విధంగా కాళ్ళెత్తి టీపాయి మీద పెట్టి – గోరింటాకు పెట్టుకొంటోంది. అరచేతి కొన వేళ్ళదాకా పూలరెమ్మలు. పాదాల పారాణిలో పూలతీగలు.

ఛట్! నేనే వెర్రివాడిని!

సింక్ దగ్గరకు వెళ్ళి ముఖాన నీళ్ళు చల్లుకున్నాను.

తిరిగి వచ్చేసరికి హారిక లేదు. మంచం మీద దిండ్లు చేరగిల వేసుకుని గోరింటాకు ఆరేలా. కాళ్ళు చేతులు చాచి పెట్టుకుంది. కనులు మూతపడి ఉన్నాయి. విరామమో విశ్రాంతో నిద్రో – నేను మాట్లాడకుండా కళ్ళు మూసుకొని పడుకున్నాను. మంచం మీద మరో పక్కన.

సెల్ శబ్దంతో మెలుకువ వచ్చింది. కళ్ళు తెరిచి చూస్తే – పక్కన హారిక లేదు.

చివాలున లేచి కూర్చున్నాను నడిమంచంలో.

ఇవ్వాళ పొద్దుటి నుంచీ ఒకటే చిరాకు, కోపం.

"హారిక ఎటుపోయిందో" – "బద్ధకంగా వంగి సెల్ చూసుకొన్నాను. మెయిల్ ఎలర్ట్ చేస్తున్న ఎసెమ్మెస్. 'అబ్బబ్బ... ఇదొకటి!" చిరాగ్గా సెల్ గొంతు నొక్కేశాను.

"ఎక్కడకి వెళ్ళిందీవిడ? ఏమైపోయింది?" తల విదిల్చి లేచి కూర్చున్నాను. బాత్ రూంలో దూరి షవర్ కింద తల పెట్టేశాను.

ఎంతసేపు అలా ఉన్నానో– నాకే తెలియదు.

*

అదాటుగా లేచాను. అదిరి పడ్డట్లుగా...

మాగన్నుగా నిద్రపోతున్నానేమో ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాను.

అయినా, నాకేం తక్కువని? అన్నీ అమరిన జీవితం.

హాయిగా బతికేయవచ్చు. కానీ, ఏదో తొలుస్తోంది, లోలోపల, ఎందుకో తెలియదు.

ఇదంతా పని వత్తిడి అంటారు. కోలీగ్స్.

పర్సనాటీ డెవలప్‌మెంట్‌లు – మెడిటేషన్, యోగాలు – ఏవీ మనసును లగ్నం చేయనివ్వడంలేదు. నిజానికి, తనే మనసు లగ్నం చేసి వాటి నియమావళిని క్రమబద్ధంగా పాటించలేకపోతున్నాడు.

కంపెనీలో ఒక్కో మెట్టు ఎక్కుతూ ఎదగవచ్చు. కానీ, చేరిన కొత్తల్లోనే ఏకంగా శిఖరాగ్రం చేరిపోయినట్లయింది. డెడ్ లైన్లు, పబ్లిక్ రిలేషన్లు, సాయంత్రం పార్టీలు, ఆదివారం క్లబ్బులు, జీవితం అంతా ఒక పకడ్బందీ వ్యవహారం అయిపోయింది. సుఖంగా ఉంది. ఊహు, లేదు. ఎందులోనూ మనసు పెట్టలేకపోతున్నాను, నానాటికీ.

మధ్యాహ్నం మిత్రబృందంతో మరో సిట్టింగ్ వేస్తే కానీ ఈ ఆలోచన వదిలేట్టుగా లేదు. ఎన్నడూ లేనిది ఇవ్వాళ ఉదయం అర్ధాంతరంగా ఆట వదిలేసాను, ఎప్పుడూ జరగలేదు.

గబగబ సెల్‌ఫోన్ తీసి ఫోన్లు చేశాను.

ఒకరి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంటే – మరొకరు లిఫ్ట్ చేయట్లేదు. ఇంకొకరి ఫోన్ ఆన్సరింగ్ మెషీన్‌కి కనెక్ట్ చేసి ఉంది.

ఛ!

రిలాక్స్ అవ్వాలంటే – ఎంజాయ్ చేయాలంటే – ఇదే మార్గం!

కథా నిలయం
శ్రీకాకుళం

ఏమయిందో మా వాళ్ళకీరోజు? నా మీద కినుక వహించారేమో మరి!

మా వాళ్ళ కోపం ఎంత సేపులే... మరో పార్టీకి పిలిస్తే అదే సర్దుకుంటుంది.

మళ్ళీ మెయిల్ అలర్ట్ మెసేజ్‌తో సెల్ ఫోన్ ఠంగు మంది.

ఇంట్లో ఎవరూ ఉన్న అలికిడే లేదు.

చుట్టూ నిశ్శబ్దం. తెరలు తెరలుగా.

మెల్లిగా లేచి ల్యాప్‌టాప్‌ను వళ్ళోకి తీసుకొన్నాను. మెయిల్ హారిక నుంచే.

అప్రయత్నంగానే నా కళ్ళు అక్షరాల వెంబడి పరుగులు తీసాయి.

"ప్రహ్లాద్ నువ్వేదో బాగా డిస్ట్రబ్ అయినట్లున్నావు. పలకరించడానికే అవకాశం ఇవ్వడం లేదు. ఇక, నీ సమస్య ఏమిటో పంచుకొనేంత చనువు ఎక్కడ? అందుకే ఇలా.

ఇది మొదటిసారికాదు. తరుచూ ఇలాగే జరుగుతోంది, కొంతకాలంగా.

పదిహేనేళ్ళుగా ఇద్దరం ఒకే పనిలో ఉన్నాం, ఒకే వత్తిడి."

నిజమే, హారికదీ తనదీ ఒకే వృత్తి, ఒకే వత్తిడి. ఒకరినొకరం అర్థం చేసుకోలేనంత కఠిన పాషాణ పాకాల వ్యవహారాలు ఇక్కడేమున్నాయని?

మరి హారికకు ఎందుకు చిరాకు వేయదు? విసుగు పుట్టదు? కోపం ఎందుకు రాదు?

ఎందుకు వేయదూ? హారిక కూ చిరాకు వేస్తుంది, విసుగు పుడుతుంది, కోపం వస్తుంది.

కానీ, నేనేమి చేస్తున్నాను? ఆమె ఏమి చేస్తున్నది?

అసలు ఇన్నాళ్ళూ ఎందుకు ఆలోచించలేక పోయాను? నా తల తిరిగి పోయింది.

"ఎందుకంటే - మనం సమాంతరంగా బతికేస్తున్నాం!" హారిక అక్షరాలు మెత్తగా గుచ్చుకుంటున్నాయి, నాలోలోకి. "అలా సమాంతరంగా సాగకపోతే ఎక్కడో ఒక చోట ఖండనా తప్పదు... మలుపూ తప్పదు... అంటావేమో నీవు. ప్రహ్లాద్... గుండె తడి అంటని అలాంటి సరళ రేఖల కన్నా ఖండ ఖండాలైనా వంకరటింకరైనా సహజరేఖలు మేలు అనిపిస్తుంది నాకు. ఒక్కసారి చూడు - నీ ఉదయ సాయంత్రాలు, ఒక ఆదివారం లేదా సెలవు రోజు - ఇంకో పండుగా పబ్బం - పిల్లల బడి వార్షికోత్సవం లేదా పుట్టిన రోజు - ఎలా గడుస్తున్నాయో! నీ మాటల్లో చెప్పాలంటే - పకడ్బందీగా ప్రణాళిక ప్రకారం - హాయిగా జీవితాన్ని గడిపేస్తున్నావు. బాగానే ఉంది.

ఆ గడపడంలో నా పాత్రేమిటి? పిల్లల ప్రమేయం ఎక్కడ?

మేమూ సరదాగా హాయిగా సంతోషంగా గడపాలనుకొంటాం, నీ పక్కన చేరి.

గలగల కబుర్లాడుతూ, పకపక నవ్వుతూ.

కోపతాపాలు... కష్టనష్టాలు... ఇష్టాయిష్టాలు... ఇబ్బందులు... ఎలాంటి అరమరికలు లేకుండా పంచుకోవాలని అనుకుంటాం. ఫిర్యాదులు... గాలి కబుర్లూ... ఎలాంటి దాపరికం లేకుండా నీతో పంచుకోవాలనే అనుకుంటాం. కానీ, మన సరసల్లాపాల సంగతి-సంసార సరాగాల సంగతి- అటుంచి - సాధారణ సంభాషణలే అరుదయిపోయాయి.

నీ జీవన శైలి మాకు సమాంతరంగా సాగిపోతోంది. ఈ క్రమంలో మా నుంచి దూరంగా నీలోకి నీవే ముడుచుకు పోతున్నావనిపిస్తోంది. ఒక చట్రంలోకి బిగుసుకు పోతున్నావని పిస్తోంది. నిజం చెప్పాలంటే - మాకు భయం వేస్తోంది! నువ్వు మాకు పరాయి వాడిగా బతికేస్తున్నావని!"

బలవంతంగా కళ్ళు మూసుకొన్నాను. హారిక మాటలు కనురెప్పలనే కాదు హృదయాన్ని తాకుతున్నాయి, మొదటిసారిగా.

"సమాంతరంగా బతికేస్తున్నాం!"

నిజమే మరి.

పిల్లలు బడి, ట్యూషన్లు, కంప్యూటర్, డాన్స్ మ్యూజిక్ క్లాసులు.

హారిక ఆఫీసు, ఇల్లు, పిల్లల వ్యవహారాలు, మార్కెట్ తతంగాలు.

తన సంగతి సరేసరి!

వీటి నడుమ తమ నలుగురి మధ్య ఉన్న సంబంధం ఏమిటి? ఎలాంటిది?

ముఖాన్ని అరచేతుల్లో దాచుకున్నాను. తల దిమ్మెక్కి పోతోంది.

"ఛ... ఛ! నేనేనా హారిక హర్ట్ అయినా ఫర్వాలేదు అనుకున్నదీ! ఆమె మంచం మీద బోర్లాపడి ఏడుస్తుంటే చూసినా – ఓదార్చకుండా బెట్టు చేయాలని అనుకున్నదీ! ఏమైంది నాకు? నా హారిక గురించి ఇంత అమానుషంగా నేనెలా ఆలోచించ గలిగాను? అయ్యో – ఏదో అయ్యింది, నా లోలోన. ఏదో అవుతుంది, తలుచుకుంటేనే సిగ్గుగా ఉంది. తనలో ఇంత సంకుచితమైన మనిషి ఉన్నాడా అని!"

నొసలు వత్తుకున్నాను, కళ్ళు మూసుకున్నాను.

హారిక మాట్లాడుతుందేమో నన్నట్లుగా ఆమె అక్షరాలు చల్లగా పలకరించాయి, మెల్లిమెల్లిగా నాలో నిండిపోతూ...

"ఏకాంతంగా ఉన్నపుడు ఎంత చక్కగా ఈలపాట పాడే వాడివి? మూతి సున్నాలా చుట్టి, ముద్దొచ్చేలా గాలితో పాటు అలవోకగా తేలి వచ్చి నన్ను పలకరించేది. పలకరించడమేమిటి హాయిగా గిలిగింతలు పెట్టేది. అలాగే

కదా మన పరిచయం మొదలైంది. మనం కలిసి నాటిన పారిజాతపు పలుచని పరిమళం అప్పుడే మరిచిపోయావా?

మేఘమాల, వాన చినుకు, చిగురు కొమ్మ, పూల రెమ్మ, లేలేత ఎండ – వీటికి దూరంగా ఎసి బందిఖానాల్లోకి... గాజుగోడల గదుల్లోకి... ముడుచుకు పోతున్నాం. కదూ? మన సంబంధాల్లో సహజత్వం పోయి మర్యాదాబద్ధమై పోతున్నాయి. కదూ?

అయినా, తెర మీద పూసిన పువ్వు, సందెవేళ విచ్చుతోన్న సన్నజాజి పరిమళాల్ని మోసుకు వస్తుందా? సరి సమానమవుతుందా? ఎన్నటికైనా!

ప్రకృతికి దూరమై పోతూ మనకి మనమే దూరమై పోతున్నామేమో, ప్రహ్లాద్... వృత్తి వ్యాపకాల్లో మునిగి తేలుతూ మన మానవ ప్రవృత్తికే ఎసరు పెడుతున్నామేమో. అందుకేనేమో నీటికి దూరమైన చేపల్లా ఇలా గిలగిలలాడుతున్నాం. ఈ పరాయీకరణ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఊపిరాడడం లేదు.

ఏమైనా.... బయటకు వచ్చి చూడు ప్రహ్లాద్... నీ చుట్టూ బిగించుకున్న బిగుసుకుంటోన్న చట్రంలోంచి. జీవితం ఎంతో ఉంది. జీవించాల్సిందీ మరెంతో ఉంది. ఈ ప్రకృతిలో భాగమై, ప్రతి అనుభవం ఓ పాఠమై.

ప్లీజ్...హెల్ప్ యువర్ సెల్ఫ్ !"

నాకు దీంట్లో పేచీ పడాల్సింది ఏమీ కనబడలేదు. నవనాడులూ సవరదీసుకొని – ఆలోచనల్లోంచి బయట పడ్డాను. గదిలోంచి బయటకు వచ్చాను.

అందరూ అక్కడే ఉన్నారు. హారిక, పిల్లలు.

చిన్నారి అప్పటికే హారిక కుట్టిన సీతాకోకచిలుక గౌను వేసుకున్నది. ల్యాప్‌ట్యాప్‌తో ఏదో కుస్తీ పడుతోంది.

"ఛీటింగ్ !" బుజ్జిగాడు ఓ కేక పెట్టాడు, "నాకు బట్టర్ ఫ్లై అంటే ఇష్టం కదా అమ్మా – ఎంత బాగుంటుందో – నువ్వెప్పుడు అక్కకే సీతాకోక చిలుకలు కుట్టిస్తావు!" బుజ్జి సీరియస్‌గా కంప్లయింట్ చేస్తున్నాడు.

నిజమే, చిన్నారి గౌనుపై సీతాకోకచిలుక మిలమిలలాడుతోంది. రంగురంగుల దారాల నడుమ దాగిన చమక్కుమనే చమ్కీలతో.

"ఎంత మెరిసిపోతోందో చూడు !" వాడు బుంగమూతి పెట్టాడు.

"అవి గర్ల్స్ స్టఫ్ – మై డియర్ బ్రదర్ –" చిన్నారి నవ్వుతోంది.

"కానీ, ఐ లవ్ ఇట్ అమ్మా –" వాడు హారిక చుట్టూ చేతులు చుట్టేసాడు, గారాంగా. హారిక వాడి బుగ్గలు పుణికి అలాగే కుట్టిపెడతానని వాగ్దానం చేస్తోంది.

చిన్నారి కళ్ళు లాప్‌టాప్‌పై నుంచి కదల్చకుండానే అంటోంది, "అమ్మా, తాతయ్య ఏమీ అనలేదు కానీ, నానమ్మ అడిగింది. 'పండుగపూట కూడా తీరిక దొరకలేదా మీ అమ్మా నాన్నలకు' అని!

ఛెళ్ళుమన్నట్లు లోకంలోకి వచ్చి పడ్డాను. హారిక, బుజ్జి ఆమె వంక ఆరాగా చూశారు.

"అవునన్నాను. నిజమే కదా అమ్మా – నాన్న పొద్దున్నే తయారయి బయటకు వెళ్ళిపోయారు కద!"

హారిక హావభావాలు నాకు కనబడడం లేదు. కానీ, చిన్నారి గొంతులోంచి ఏవో ప్రకంపనలు నన్ను తాకాయి.

సరిగ్గా హారిక లాగానే అమ్మ ఒకరోజు నన్ను గారాంగా భుజాలకెక్కించుకొని ఉంటుంది. నాన్నా ఇలా మురిపెంగా చూసుకొంటూ ఉండి ఉంటాడు.

నాన్న గుంభనంగా మౌనం వహించినా, అమ్మ నిష్ఠూరంగా నాలుగు మాటలన్నా –అర్థం ఒకటే! నానుంచి వారు ఒక పలకరింపును ఆశిస్తున్నారు. ఒక పరామర్శను కోరుకుంటున్నారు.

హారిక నేను ఎంత ముఖ్యమైన పనిలో ఉన్నానో చిన్నారికి చెప్పి వప్పించడానికి ముప్పతిప్పలు పడుతోంది.

అది ఎంత ముఖ్యమైన పనో  నాకు తెలియదా? ఆమెకు తెలియదా? ఎంత అందంగా అల్లినా అబద్దాలు నిజమవుతాయా? తన సరదాల్లో తను మునిగి ఉన్నాడు. అంతే!

ఇదన్నమాట విషయం! తనలాగే ఇవ్వాళ ఉదయం సమావేశమైన మిత్రబృందాన్నంతా వారి కుటుంబాలు కట్టిపడేసి ఉంటాయి. పండగనీ. పబ్బమనీ.

కానీ...!?! కానీ...!?!

ఈ క్రమంలో ఆయా ఇళ్ళల్లోని ఆడవాళ్ళు, అమ్మానాన్నలు, పిల్లలు – ఎంతగా నలిగి పోయి ఉంటారో – ఇప్పుడు హారికలా... పిల్లలకు సర్ది చెప్పటానికి – తలకిందులవుతూ.

అవును. హారిక అన్నది నిజమే –

"మానవ సంబంధాల్లోని రమణీయతను స్పృశించకుండానే మాధుర్యం చవి చూడకుండానే – యాంత్రికమై పోతూ రసహీనంగా బతికేస్తున్నాం. బతకాలనుకొంటున్నాం.

నిర్లిప్తంగా. నిర్జీవంగా.

రసరమ్య జీవితం ఎక్కడో లేదు.

మన చేతుల్లోనే ఉంది. మన చేతల్లోనే ఉంది."

నేను బలంగా ఊపిరి పీల్చి వదిలాను.

"అమ్మా...చూడు. పిట్టపిల్ల తన బుజ్జి నోరు ఎలా తెరుస్తోందో -" చిన్నారి పొలికేక పెట్టింది.

అమ్మాకొడుకులు ఒక్క పరుగున ల్యాప్‌టాప్ వద్దకు వెళ్ళి కూలబడ్డారు. వారి ముఖాలు సంభ్రమాశ్చర్యాలతో వెలిగి పోతున్నాయి. వారి సంబరాల వెలుగును చూసో ఏమో నా ముఖాన ఓ చిరునవ్వు కదలాడింది. అసంకల్పితంగా.

అంతే.

అప్పటి దాకా బిగిసిన కండరాలన్నీ ఒక్కసారిగా పట్టు వదిలినట్లుగా అనిపించింది.

ఏదో భారం వదిలినట్లుగా వళ్ళంతా తేలిక పడింది... గాలిలో తేలియాడినట్లుగా అనిపించింది. చిరాకు, కోపం, విసుగు - చిటిక వేసినంత వేగంగా మాయమైపోయాయి.

"ఉష్...!" బుజ్జి కనుబొమలు ముడేసి - రహస్యంగా మాట్లాడుతున్నట్లుగా లో గొంతుకతో అన్నాడు. "అక్కా... గట్టిగా అరవకు... పిట్ట ఎగిరిపోతోంది-"

"ల్యాప్ టాప్ స్క్రీన్ మీద నుంచా...? " ఓ మొట్టికాయ పడింది బుజ్జిగాడికి.

"కాదు. డాడీపిట్ట వచ్చేస్తుంది. అలా చూడు. ఆ రెయిలింగ్ పై వాలేస్తోంది..." బుజ్జి బుంగమూతి పెట్టి బాల్కనీ వైపు చూపించాడు.

"ఇక్కడ నుంచి చూస్తే బాగా కనబడుతుంది" నేనూ అప్రయత్నంగా లోగొంతుకతో అంటూ పిల్లలను పొదివి పట్టుకున్నాను. మరో చేత్తో హారిక చేతిని బిగించాను.

పిల్లలు ముద్దుగా ఓ స్వాగతపు చూపు విసిరేసారు.

హారిక పెదాల మీద నుంచి ఓ మురిపాల వెన్నెల తరక జాలువారింది.

కిటికీలోంచి పిట్ట రాకకై ఎదురు చూడసాగాం.

మరో మారు.

నలుగురం.

బోలెడంత ఉత్సాహంతో.

రచన
ప్రారంభం 2 సెప్టెంబర్ 2006
ముగింపు 29 అక్టోబర్ 2006